# హలో...

"హలో.. మిడిమేళపు సుబ్బారావుగారేనా."

"అవునండీ... మీరు...?"

"నాపేరు రిస్మితాసేన్"

"రిస్మితాసేనా... ఈ పేరు ఎక్కడో విన్నట్టుందే"

"ఎక్కడో వినడమేమిటండీ. నేను గత సంవత్సరం మిస్ ఇండియాని. గుర్తు పట్ట లేదా?"

"ఓ... గుర్తుపట్టా. ఇంతకీ మీరు ఎందుకు ఫోన్ చేశారో...?"

"వధువు కావాలని మీరు ఇచ్చిన పత్రికా ప్రకటన చూశా. సమున్నతమైన వ్యక్తిత్వం, నిరాడంబరత్వం కలిగిన మీలాంటి వాళ్లని పెళ్ళి చేసుకోగలిగితే అంతకంటే అదృష్టం ఏముంటుందండీ..."

ఆశ్చర్యంతో, ఆనందంతో, అయోమయంతో ఉక్కిరి బిక్కిరయ్యాడు సుబ్బారావు.

......

"మాట్లాడరేమిటండీ సుబ్బారావుగారూ..."



# తనకి తానే మెప్పు

"ఆ...ఆ... మాట్లాడుతున్నాను. ఏమండీ రిస్మితగారూ. మీరు తెలుగు చాలా చక్కగా మాట్లాడగలుగుతున్నారు. ఆంధ్రదేశంలో పుట్టినవాళ్ళే తెలుగును అనేక భాషలతో కలగాపులగం చేసి, అసలు తెలుగంటే ఏమిటో తెలియనట్టు మాట్లాడుతున్నారు. అటువంటిది మీరు చక్కటి తెలుగు మాట్లాడుతుంటే వినసొంపుగా ఉంది".

"చిన్నప్పటి నుంచీ మాయింటి పక్కన తెలుగువాళ్ళు ఉండేవాళ్ళు. వాళ్ళతో మాట్లాడి మాట్లాడి తెలుగు వచ్చేసింది. ఇప్పుడు నేను తెలుగు రాయగలను కూడా".

"చాలా సంతోషం రిస్మితగారూ. ఇంతకీ మీరు ఏ ఊరి నుంచి మాట్లాడుతున్నారు?"

"ఢిల్లీ నుంచి మాట్లాడుతున్నాను. మిమ్మల్ని పెళ్ళి చేసుకోగలిగితే మీతోపాటే అంబాజీపేటలో ఉంటాను".

"రిస్మితగారూ... మీ ప్రతిపాదనను తప్పక పరిశీలిస్తాను".



నమస్తే...

నమస్తే...

టెలిఫోన్ పెట్టేసి ఆరోజు వచ్చిన ఉత్తరాలు చూడడం మొదలుపెట్టాడు సుబ్బారావు. దాదాపు పాతిక ఉత్తరాలున్నాయి. అందులో గులాబిరంగు కవరు సుబ్బారావు దృష్టినే కాదు గుండెను కూడా ఆకర్షించింది. వెంటనే ఆత్రంగా ఆ ఉత్తరాన్ని తీసి కవరు మీద అక్షరాల్ని చూశాడు. ముత్యాల్లాంటి అక్షరాలు.

"ఫ్రం... వీణాధరి, వైజాగ్" అని ఉంది.

సుబ్బారావుకి ఆశ్చర్యమేసింది. ప్రముఖ కూచిపూడి నృత్యకారిణి తనకి లేఖ రాసింది. విషయమేమిటోనని మనసు తొందర పెట్టింది. వెంటనే కవరు తెరిచి చూశాడు. అక్షరాల వెంట కళ్ళు వేగంగా పరుగులు తీసినై. సారాంశం... పెళ్ళి ప్రతిపాదనే. తనలాంటి ఆదర్శమూర్తిని, నిరాడంబరుడినీ పెళ్ళి చేసుకోవాలన్న అభిలాషని వ్యక్తం చేసింది వీణ.

తన జీవితాన్నంతటినీ కళకే అంకితం చేద్దామనుకున్నానని, సుబ్బారావు పెళ్ళి ప్రకటన చూసాక ఈ ఉత్తరం రాయాల్సి వచ్చిందనీ వీణాధరి వివరించింది.

సుబ్బారావుని పెళ్ళి చేసుకొని, ఆయన సహకారంతో "ప్రతి స్త్రీ విజయం వెనుక ఒక పురుషుడు ఉన్నాడని" నిరూపిస్తానని వీణ పేర్కొంది.

**సోమేపల్లి వెంకటసుబ్బయ్య**

సుబ్బారావు ఒక్క నిమిషం రిస్మితా గురించి ఆలోచించినట్టే వీణాధరి గురించీ ఆలోచించ సాగాడు. ఇంకా ఆలోచనలో ఉండగానే–

"ఒరేయ్ అన్నయ్యా ఫ్యాక్స్ వచ్చింది చూడ రా" అంటూ చెల్లాయి నందిని ఒక కాగితం చేతిలో పెట్టి తుర్రున జారుకుంది.

ఫ్యాక్స్‌లో వచ్చింది సందేశం కాదు. బయో డేటా. ఆ బయోడేటాని ఆసక్తిగా చూశాడు. అది జ్యోత్స్నరావుది. సుబ్బారావు కంప్యూటర్ మైండ్‌కి వెంటనే గుర్తొచ్చింది. క్రితం వారమే ఆమె గురించి దాదాపు అన్ని పత్రికల్లో "మహిళా విజయం" పేరుతో కథనాలు వచ్చినయ్. అతి చిన్న వయసులో అతి పెద్ద కంపెనీకి జనరల్ మేనేజర్ అయిందామె. జీతం నెలకి దాదాపు రెండు లక్షల రూపాయలు. ఆమె ఎంతో మందికి ఆదర్శం. ఆమె జీనియస్. ఆమె భాగ్యనగర నివాసి.

బయోడేటా చదవగానే చివర్లో రెండోపేజీ చూడమని సూచన ఉంది. తనకి చెల్లాయి ఒక పేజీయే ఇచ్చింది. వెంటనే ఫ్యాక్స్ దగ్గరకి వేగంగా వెళ్ళాడు రెండోపేజీ కోసం. అప్పటికే రెండోపేజి సిద్ధంగా ఉంది. ఆత్రంగా ఆ పేజీ తీసుకొని అక్కడికక్కడే చదివేశాడు.

"తనకి ధనం ప్రధానం కాదని, వ్యక్తిత్వం ముఖ్యమని, సుబ్బారావు అంగీకరిస్తే పెళ్ళి చేసుకోవాలని ఉందనీ" రాసి ఉంది అందులో. సుబ్బారావుకి మెదడు మొద్దుబారిపోయింది. ఊహించని ఉత్తరాలు... ఆశ్చర్యం, ఆనందం. ఆ ఆనందంలో మునిగి తేలుతూండగానే...

కాలింగ్‌బెల్ శబ్దం. రెండు మూడుసార్లు అస్పష్టంగా వినిపించింది. అనుమానంగానే వెళ్ళి తలుపులు తెరిచాడు.

పూర్తిగా తెల్లని దుస్తుల్లో అదే రంగు టోపీ పెట్టుకొని ఒక వ్యక్తి వినయంగా నిల్చున్నాడు. సుబ్బారావుని చూడగానే తల మరింతగా వంచి "గుడ్‌మార్నింగ్ సార్" అన్నాడు.

ప్రత్యుత్తరంగా తలవూపి విషయం ఏమిటన్నట్టు చూశాడు సుబ్బారావు.

"అయామ్ ఫ్రం అమెరికా" అన్నాడు ఆ వచ్చిన వ్యక్తి.

"అ...మె...రి...కా...యా!?!" ఆ ఆశ్చర్యం అవయవాల్లో కనిపించనీయకుండా జాగ్రత్త పడుతూ–

"అయితే ఏమిటంటా" అన్నట్టు మళ్ళీ చూశాడు సుబ్బారావు.

"మీరు బిల్‌గేట్స్ పేరు విన్నారు కదా...?"

"అవును... విన్నాను ఇంతకీ విషయం ...?"

"వాళ్ళ కజిన్ కూతురు మార్గరెట్ గేట్స్ మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలనుకొంటున్నారు. మీకీ లెటర్ ఇవ్వమని స్పెషల్‌గా నన్ను పంపించారు" అన్నాడు.

లెటరు అందుకున్న సుబ్బారావు "ఇక మీరు వెళ్ళొచ్చు" నన్నట్టు హరిత సంకేతం ఇచ్చాడు. ఉత్తరం ఇచ్చిన వ్యక్తి గేటు దాటీ దాటకముందే బర్రున ఉత్తరం చించి చదివేశాడు సుబ్బారావు. తన ప్రతిభ అమెరికా దాకా చేరినందుకు ఆనందం వేసింది. బిల్‌గేట్స్ అంతటి ప్రపంచంలోనే ధనికుడి కజిన్ కూతురు తనని పెళ్ళి చేసుకుంటానని అనడం నమ్మబుద్ధి కాలేదు సుబ్బారావుకి.

సుబ్బారావు మనసిప్పుడు క్రాస్‌రోడ్స్‌లో ఉంది. ఎటువెళ్ళాలో తెలియడం లేదు. అంతా అయోమయం తల దిమ్మెక్కింది. రెండు చేతులతో తల గట్టిగా పట్టుకున్నాడు. పది నిమిషాలు మౌనంగా గడిచాయి. మెరుపులా ఓ ఆలోచన వచ్చింది. తన ఆలోచనలకి అక్షర




రూపం ఇచ్చి తృప్తిగా నిట్టూర్చి నిద్రలోకి జారుకున్నాడు. సుబ్బారావు కలం నుంచి జాలువారిన అక్షరాల రూపం...

## ప్రకటన

*గతనెల 12వ తేదీన "వధువు కావలెను" అనే ప్రకటన అన్ని దినపత్రికల్లో ఇచ్చాను. అందులో "సమున్నతమైన వ్యక్తిత్వం, నిరాడంబరత కలిగిన మిడిమేళపు సుబ్బారావు అనే అంబాజీపేట యువకునికి తగిన వధువు కావాలని" ప్రకటించాను. ఆ ప్రకటన అసమగ్రంగా ఉన్నదని భావించి మరికొంత అదనపు సమాచారంతో ఇప్పుడు మరొక ప్రకటన ఇస్తున్నాను. మిడిమేళపు సుబ్బారావు, అంబాజీపేట అనే నాకు కావల్సిన వధువు రిస్మితాసేన్ అందం, వీణాధరి నాట్యం, జ్యోత్స్నారావు తెలివితేటలు, మార్గరెట్ గేట్స్ ఐశ్వర్యం కలగలుపుకొని ఉన్న యువతి అయితే మంచిది. అటువంటి యువతి నుంచి ఇప్పటి దాకా ఎటువంటి ప్రతిపాదనలూ అందలేదు. ఇప్పటి వరకూ అందిన ప్రతిపాదనలు ఈ ప్రకటనలో పేర్కొన్న అన్ని అంశాలు కలగలుపుకొని ఉండ నందున తిరస్కరించడమైనది. పై విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకు అవకాశం లేదని తెలియజేస్తున్నాను.*

ఇట్లు
మిడిమేళపు సుబ్బారావు
అంబాజీపేట

"కొంపముంచావ్ గదరా సుబ్బారావ్" తలుపులు దబాదబా బాదుతున్నాడు ఏడుకొండలు.

కంగారుగా కళ్ళువిప్పి తలుపు తెరిచి చూశాడు సుబ్బారావు.

"ఇట్లా పొద్దెక్కిందాకా ముసుగుతన్ని పడుకుంటే ఎట్లారా మిడిమేళపు సుబ్బారావ్. నీవల్ల సగం ఊరు న్యూస్ పేపర్లు పంచకుండా ఆగిపోయింది. ఏం గొడవొస్తుందో ఏమో" అన్నాడు ఏడుకొండలు ఏడుపు మొఖంతో. హడావుడి పడుతూ గబగబా సైకిలెక్కి పేపర్లు పంచడానికి ఉరుకులు పరుగులెత్తాడు మిడిమేళపు సుబ్బారావు మిట్టమధ్యాహ్న వేళలో... ●